క్లుప్తంగా

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



నవ్యకు చెక్కు అందజేస్తున్న గ్లో ప్రతినిధులు రుూన్సీ లక్ష్మి, వెంకన్నచౌదరి

అక్కిరెడ్డిపాలెం: మెడిసిన్ చదువుతున్న పేద విద్యార్థినికి గ్లో సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. కొవ్వూరుకు చెందిన మామిడి నవ్య తగరపువలసలో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈమె నిరుపేద కుటుంబానికి చెందడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించిన గ్లో సంస్థ, ఆంధ్రా మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఎంసీఓఎస్ఏ) సంయుక్తంగా రూ.20 వేల సహాయం అందించారు. షీలానగర్‌లోని అనూరాధా ఆటో (పెట్రోల్ బంక్)లో గ్లో అధ్యక్షులు ఆర్.రుూన్సీలక్ష్మి, వై.వెంకన్న చౌదరి చేతుల మీదుగా బుధవారం చెక్కును అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉక్కు డీజీఎం రాజు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డులకు చెందిన అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అగనంపూడి ఆస్పత్రి గేటును ఆనుకొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉక్కు డీజీఎం కె.ఎస్.ఎన్.రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవలకు సత్యసాయి సేవా మండలి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జనని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విందుల వెంకటరమణ, సత్యసాయి భజన మండలి ప్రతినిధులు జి.రామకృష్ణ, విందుల పైడినాయుడు, ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్

అగనంపూడి: కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్‌ను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ ప్రకటించిందని విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతుల సుధాకర్ తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గత నెలలో అక్రిడేషన్ కౌన్సిల్ బృందం కళాశాలలో పర్యటించి విద్యా బోధన, ల్యాబ్, వసతులను పరిశీలించిందన్నారు. నాలుగు పాయింట్లకు గాను 3.49 పాయింట్లతో ఏ ప్లస్ స్థాయి కల్పించారని వారు చెప్పారు. విద్యా సంస్థల చైర్మన్ రత్తయ్య, వైస్ చైర్మన్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలిపారని వారు తెలియజేశారు.

ఆలోచింపజేసిన 'వెండి అంచులు'

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో వెండి అంచులు నాటకాన్ని ప్రదర్శించారు. పల్లూరూ శివప్రసాద్ రచించిన ఈ నాటకానికి గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు. ఏడు పదుల దాటిన వయసులో పురుషుడు తనకంటే చిన్నది అయిన మహిళను పెళ్లి చేసుకోవచ్చా అనే అంశంపై ప్రదర్శించిన నాటకం ఆలోచింపజేసింది.

» రెండో నాటకంగా పెందుర్తికి చెందిన శ్రీనటరాజ డ్రమటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనుకోని అతిథి నాటకాన్ని ప్రదర్శించారు. దీనిని రావి నాగేశ్వరరావు రచించగా, పిళ్లా సన్యాసిరావు దర్శకత్వం వహించారు.

కాలుష్య నివారణకు చర్యలు

- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్
- 'హిందుజా' పై ఫిర్యాదుతో నక్కవానిపాలెంలో పర్యటన
- నీటి శాంపిల్స్ సేకరించాలని ఆదేశం



నక్కవానిపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: హిందుజా నేషనల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన యాష్ పాండ్ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ స్పష్టం చేశారు. హిందుజా నేషనల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ యాష్‌పాండ్ నుంచి వచ్చే ధూళి కారణంగా గాలి, నీరు కలుషితం అవుతున్నాయని జీవీఎంసీ 77వ వార్డు పరిధి నక్కవానిపాలెం గ్రామస్తులు ఇటీవల స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భూగర్భ జల శాఖ, వ్యవసాయ శాఖాధికారులు, కాలుష్య నివారణ శాఖాధికారులు బుధవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా యాష్‌పాండ్‌ను పరిశీలించారు.

గాలి, నీరు కలుషితం

హిందుజా రాకముందు ఈ ప్రాంతంలో వ్యవసాయం బాగా ఉండేదని, ఇక్కడి ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉండేవారని స్థానికులు అధికారులకు వివరించారు. హిందుజా వచ్చిన తర్వాత నక్కవానిపాలేనికి సమీపంలో అంటే సుమారు 500 మీటర్ల దూరంలో యాష్‌పాండ్ ఏర్పాటు చేసి అందులో బొగ్గు నుంచి వచ్చే బూడిదను నిల్వ ఉంచుతున్నారని తెలిపారు. దీని కారణంగా గాలి వీచినప్పుడల్లా ఆ ధూళి తమ గ్రామంలోకి వస్తోందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు వ్యవసాయ భూములన్నీ సారం కోల్పోయాయని తెలియజేశారు. స్థానికంగా ఉంటున్న తాము దీర్ఘకాలిక వ్యాధులతో సతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి గడ్డి తిని, నీళ్లు తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయని పేర్కొన్నారు. కనీసం ఇక్కడ ఆకు కూరలు కూడా పండించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. గాలి, నీరు కలుషితం కావడంతో తాము ఇబ్బందులు పడుతున్నా, ఒక పక్క వ్యవసాయం, మరోపక్క ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. దీంతో స్పందించిన ఆర్డీవో యాష్‌పాండ్ వల్ల ఇబ్బందులకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించి వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నివేదికను బట్టి చర్యలు

ఆర్డీవో మాట్లాడుతూ కాలుష్య ప్రభావిత ప్రాంతాల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నామని చెప్పారు. ఈ విషయంపై నివేదిక కోరామని, నివేదిక వచ్చిన తర్వాత జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. నీటి శాంపిల్స్‌ను సేకరించామని తెలిపారు. అయితే స్థానిక ప్రజలు మాత్రం తమను కాలుష్యం బారి నుంచి తప్పించాలని వేడుకున్నారు. తమ గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఆర్డీవో వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు, భూగర్భ జల వనరుల శాఖ ఏడీ శోభారాణి, వెటర్నరీ అసిస్టెంట్ సురేష్, వ్యవసాయ శాఖాధికారి సూర్యకాంతం, తహసీల్దార్ రమాదేవి, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి తదితరులున్నారు.

'సుబ్బారావు లేని లోటు తీర్చలేనిది'



సుబ్బారావు చిత్రపటం వద్ద సంతాపం తెలుపుతున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: సీపీఎం సీనియర్ నాయకుడు గొల్లపల్లి సుబ్బారావు లేని లోటు కార్మికవర్గానికి తీర్చలేనిదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. షీలానగర్‌లోని సుబ్బారావు నివాసం వద్ద బుధవారం నిర్వహించిన సంతాప సభలో మంత్రి మాట్లాడారు. సుబ్బారావు కార్మికుల సంక్షేమానికి నిత్యం కృషి చేసిన నాయకుడని కొనియాడారు. కార్మిక ఉద్యమ నేతగా సుబ్బారావుకు యావత్ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో సిటూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ డాక్టర్ గంగారామ్, ఎం.వి.ఎస్.శర్మ, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, జగ్గునాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో భక్తులకు శతమానం చూపిస్తున్న పురోహితుడు

గాజువాక : పాతకర్ణవానిపాలెం రామాలయం ద్వితీయ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆగమ పండితుడు రవికుమార్ శర్మ పర్యవేక్షణలో అర్చకబృందం కల్యాణ వేడుకను వైభవంగా జరిపించారు. కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రతినిధి సిరసపల్లి అప్పారావు దంపతులు తొలిపూజ చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. అన్న సమారాధనలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు గొంతిన దేముడు, కరణం రామకృష్ణ, కన్నయ్య, నూకరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం



దీక్షలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ముకాస్తూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ విమర్శించారు. విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 790వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎల్‌ఎంఎంఎం మరియు ఎస్‌బీఎమ్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధి వీఎస్‌ఈజెడ్ విద్యుత్ సబ్ స్టేషన్లలోని 132/33 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శివాజీనగర్, కూర్మన్నపాలెం, ప్రశాంతినగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన అమ్మవార్ల అనుపు మహోత్సవం

పెదగంట్యాడ: నెల్లిముక్కు పంచాయతీ 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు పెంటమాంబ, కుంచుమాంబ అమ్మవార్ల అనుపు మహోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. అమ్మవార్లను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు దర్శించుకున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కూర్మన్నపాలెం : ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ సిద్దేశ్వరానికి చెందిన శ్రీరామ్‌సాయినిఖిల్ అగనంపూడి సాయినగర్‌కు చెందిన రాణిని 2016లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారు పెద్దలకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకుని బయట విడిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాణి సోదరుడు పి.నవీన్(25) కారు వాషింగ్‌కు ఇచ్చి కూర్మన్నపాలెం బస్‌స్టాప్ వద్ద వేచి ఉన్నాడు. అదే మార్గంలో అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన నిఖిల్.. నవీన్‌తో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య తోపులాట చోటుచేసుకుంది. నిఖిల్ వద్ద ఉన్న బటన్ చాక్‌తో దాడి చేయడంతో నవీన్ వీపుపై స్వల్ప గాయమైంది. నిఖిల్ అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు నవీన్‌ను అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిఖిల్‌పై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్విభాగ క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలతో డైరెక్టర్ మొహంతి, సీజీఎం ప్రకాశ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంతర్విభాగ క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్విభాగ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బీఎఫ్, ఎస్.ఎం.ఎస్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్స్‌లో బీఎఫ్ జట్టు 35 పరుగుల తేడాతో గెలుపొందింది. స్పోర్ట్స్ విభాగంలో బుధవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, బీఎఫ్ జీఎం బి. కృష్ణారావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు పి.వి.నగేష్ విజేతలను అభినందించారు.

సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా బోగాది



బోగాది సన్యాసిరావు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు (సన్నీ) నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. నాతయ్యపాలేనికి చెందిన బోగాది వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి విశేష సేవలు అందించారు. ప్రజా నేతగా, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మన్ననలందుకున్నారు. బోగాది సేవలను గుర్తించిన నాయకత్వం ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియమించడంపై పార్టీ స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సన్నీ మాట్లాడుతూ రెండు సంవత్సరాల పాటు తాను ఈ పదవిలో కొనసాగనున్నట్లు తెలిపారు. తనకు ఈ పదవి లభించడంలో సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన



మృతురాలు నాగలక్ష్మి



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న గాజువాక సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ ప్రాణాలు కోల్పోయిందంటూ మృతురాలి బంధువులు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక సీఐ ఎల్.భాస్కర్ ఇరువర్గాలతో చర్చలు జరపడంతో, పరిస్థితి అదుపులోకి వచ్చింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

యలమంచిలిలోని నర్సింగపల్లి, పాలపుసోమవారం పేటకు చెందిన వై.నాగలక్ష్మి (25) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమె భర్త గోవింద్ అనకాపల్లిలోని ఓ ఆస్పత్రిలో ఆమెను చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ తీసుకువెళ్లాలని వైద్యులు సూచించడంతో ఆమెను షీలానగర్‌లో కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చేర్చే సమయంలోనే ఆమె పరిస్థితి బాగా లేదని, న్యుమోనియా, రక్తహీనతతో ఉందని బంధువులకు తెలియజేశారు. గత శుక్రవారం నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగలక్ష్మి బుధవారం మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే నాగలక్ష్మి మృతి చెందిందంటూ ఆరోపించారు. అప్పటికే నాగలక్ష్మి వైద్యానికి రూ.1.80 లక్షలు చెల్లించామని, మరో రూ.2లక్షలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపారని మృతురాలి బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో గాజువాక సీఐ ఎల్.భాస్కర్, ఎస్ఐ కొల్లి సతీష్ మృతురాలి బంధువులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. మిగిలిన వైద్య ఖర్చులు ఉపసంహరించుకునేటట్లు సయోధ్య కుదరడంతో పరిస్థితి సద్దుమణిగింది. మృతురాలికి పాప, బాబు ఉన్నారని పోలీసులు తెలిపారు.

ఎత్తు నుంచి జారి పడి వ్యక్తి మృతి

మల్కాపురం: నిర్మాణం జరుగుతున్న ఎత్తయిన ప్రదేశం నుంచి జారి పడిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక పరిధి మింది సమీపంలోని గుడివాడ అప్పన్నకాలనీ ప్రాంతంలో బొడ్డేటి కుమార్ (34) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. కుమార్ 20 రోజులుగా తన బంధువైన ఈశ్వరరావు వద్ద షెడ్ కట్టే పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో డాక్‌యార్డ్ సమీపంలోని ధనలక్ష్మి గొడౌన్స్‌లో రేకుల షెడ్ వద్ద బుధవారం మధ్యాహ్నం పనులు పర్యవేక్షిస్తున్న సమయంలో షెడ్‌పై సిమెంట్ రేకులు బిగించడం కోసం పైకి ఎక్కిన కుమార్ షీట్‌పై కాలు వేయడంతో అదుపు తప్పి, కిందికి జారిపోయాడు. తీవ్రగాయాల పాలైన కుమార్‌ను బంధువుల సాయంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడి బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ లూథర్‌బాబు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై విచారించారు.

16 నుంచి సింహగిరిపై చందనం అరగదీత

- మూడు మణుగులు అరగదీసేందుకు ఏర్పాట్లు

సింహాచలం : సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఆలయంలో తొలి చందనం చెక్కకు పూజలు నిర్వహించిన అనంతరం అరగదీత ప్రారంభమవుతుందని తెలిపారు. పన్నెండు మణుగుల చందనం (480 కిలోలు చందనం)లో ఉండే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ రోజు (చందనోత్సవం రోజు) మాత్రమే నిజరూప దర్శనాన్ని అందజేస్తారు. అదే రోజు రాత్రి స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని (120 కిలోలు) సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేస్తారు. తదుపరి వైశాఖ, జ్యేష్ఠ, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని (120 కిలోల చొప్పున) స్వామికి సమర్పిస్తారు. ఈ నెల 23న చందనోత్సవం కావడంతో ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించేందుకు కావాల్సిన చందనాన్ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ బేడా మండపంలో అరగదీతకు వీలుగా శానలను ఏర్పాటు చేశారు.

అపూర్వ ఆదరణ

- 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి విశేష స్పందన
- నాయకులకు వాడవాడలా సాదర స్వాగతం



జూబిలీహిల్స్‌లో వృద్ధురాలికి స్టిక్కర్ అందిస్తున్న జేసీఎస్ కన్వీనర్ రామచంద్రరాజు



86వ వార్డులో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న దామా సుబ్బారావు

అగనంపూడి: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోంది. నాయకులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాలను వివరిస్తున్నారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటిస్తున్నారు.

- 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంట్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు కాపు జగ్గరాజుపేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు నమ్మి శ్రీనివాస్ ప్రసాద్, మాడిశ అప్పలరాజు, సంద్రాన అప్పలరాజు, త్రినాథ్, రమణ తదితరులు పాల్గొన్నారు.
- 79వ వార్డు ప్రశాంతినగర్ సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, జేసీఎస్ క్లస్టర్ కన్వీనర్ రామచంద్రరాజు, మామిడి శ్రీను, జెర్రిపోతుల సమర, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 86వ వార్డులోని డాక్‌యార్డ్ కాలనీ, ఎస్సీ కాలనీ, భరత్‌నగర్-1,2, కూర్మన్నపాలెం, దువ్వాడ సెక్టార్-2లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, శ్రీనివాస్‌పట్నాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- 87వ వార్డులోని పలు ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వార్డులోని ప్రతి ఇంటినీ సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కొమటి రమాదేవి, శీరం నూకరాజు, వారిది శ్రీను, కర్రి అంజి తదితరులు పాల్గొన్నారు.
- కాపుజగ్గరాజుపేట సచివాలయ పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

75వ వార్డులో..



75వ వార్డులో స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న కొయ్య భారతి తదితరులు



తుంగ్లాంలో మహిళకు స్టిక్కర్ అందిస్తున్న బోగాది సన్యాసిరావు

పెదగంట్యాడ: ప్రజల మద్దతు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని ఆ పార్టీ 75వ వార్డు నాయకులు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 75వ వార్డు నాయకురాలు కొయ్య భారతి ఆధ్వర్యంలో పెదగంట్యాడలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: 69వ వార్డు తుంగ్లాంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై మహిళల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఈగలపాటి యువశ్రీ, కాకి అప్పల రెడ్డి, విరోతి రాము, సాలాపు వెంకటరావు, కృష్ణంరాజు, వరదాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

- 68వ వార్డు మింది, రాంనగర్, గుడివాడ అప్పన్నకాలనీల్లో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సంద్రాన నూకరాజు, బోనెల జోసెఫ్, అచ్యుతరావు, నేలపాటి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలని పూజలు

- భద్రాచలం చేరిన బస్సు యాత్ర



భద్రాచలంలో అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు, డ్వాక్రా ఆర్పీలు

సీతంపేట: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. డ్వాక్రా ఆర్పీలు, స్థానిక మహిళా నాయకులతో కలిసి మంగళవారం ఉదయం సీతంపేట మూడు గుళ్ల నుంచి బస్సులో యాత్రకు బయలుదేరిన విషయం తెలిసిందే. మార్గమధ్యలో అనకాపల్లి నూకాలమ్మ, తలుపులమ్మ లోవలో అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పించి మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రార్థించారు. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని సీతమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. సీతారాములకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. గత నాలుగేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. అనంతరం సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటి ప్రయోజనాలు నేరుగా మహిళలకే అందజేస్తున్నారని గుర్తుచేశారు. లంచాలు, అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు అందజేసి, ప్రజలందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడే మరలా సీఎం కావాలని యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భీమవరపు శ్రీనివాసరావు, నమ్మి పద్మా వెంకట్ పాల్గొన్నారు.